


# లాలస

**యర్రగుంట్ల సూర్యమూర్తి**

**సంజనకి ఏమీ ఊసుపోవడం లేదు. భర్త ఓ చిన్న పరిశ్రమకు యజమాని. ఆ వ్యాపారంలో బాగానే డబ్బును ఆర్జించేడు; ఇంకా ఆర్జిస్తూనే వున్నాడు. ప్రొద్దున్న తొమ్మిది గంటలకు ఇంటివద్ద ఫలహారంచేసి, కారులో ఆఫీసుకుపోతే మళ్ళీ అతడు తిరిగి ఇంటికి చేరేసరికి రాత్రి ఏ తొమ్మిది గంటలో అవుతుంది.**

వారానికి ఒకటి రెండు రోజులు ఏ బిజినెస్ ఫ్రెండ్సో వస్తే వారికి ఏ హోటల్‌లోనో ఆతిథ్యం ఇచ్చేవాడు. త్రాగడం, తినడం అయి అతడు ఇంటికి వచ్చేసరికి రాత్రి ఏ పన్నెండు గంటలో దాటుతుంది. అతడి పరిశ్రమ అటువంటిది లాభాలు బాగా రావాలంటే ఈ స్నేహాలు, ఈ ఆతిథ్యాలు తప్పవు.

అందువల్ల అతడి భార్య సంజన అలా వంటరిగా ఇంట్లో వుండవలసి వస్తుండేది. ఆమెకు సంతానం ఒక కొడుకు, ఒక కూతురు. ఆ ఇద్దరూ ఊటీలోని దొరలు నడిపే ఓ కాన్వెంట్ స్కూల్లో చదువు కొంటు న్నారు, అక్కడే హాస్టల్లో వుంటూ, పిల్లలు దగ్గరవుంటే వారి బాగోగులు చదువులు చూసుకుంటుంటే కొంత కాలక్షేపంఅవును సంజనకు. కానీ ఆ పనిలేకపోయింది. ఆ మహానగరంలోని ఓ మూడు క్లబ్బుల్లో ఆమె మెంబరు. అప్పుడప్పుడు ఆ క్లబ్బులకుపోయి కొంతసేపు గడిపి వచ్చేది.

సంజనకు డబ్బుకేమీ కొదువలేదు. ఆమె పుట్టింటివారూ కలిగివున్న వాళ్ళే. ఆమె భర్త ధనికుడే. ఆమెకు చేతినిండా డబ్బే. ఎంత ఖర్చు చేసేవని అడిగినవాళ్ళెవరూ లేరు. అప్పటికీ ఆమె బజారుకుపోయి బట్టలనో, వగలనో, వస్తువులనో కొంటుండేది. కొన్నాళ్ళకి అవీ బోరు కొట్టేయి.

ఎవరో సజస్టు చేసేరు. టెన్నిస్ నేర్చుకోమని. ఈ రోజులలో టెన్నిస్ ఆడడం స్త్రీలకు ఓ ఫ్యాషన్ అని, ధనవంతులైన ఫాషనబుల్ లేడీస్ క్లబ్బుల్లోచేరి ఆ ఆటను నేర్చుకుని బాగానే ఆడుతున్నారని. సంజనకు అది మంచి మార్గంగానే తోచింది. సంజన స్నేహితురాళ్ళు కొందరు ఆ టెన్నిస్ క్లబ్బుల్లోచేరి, ఇప్పుడు భాగానే ఆడుతుండేవారు, మగవారికి ఏమీ తీసిపోకుండా.

ఆ స్నేహితురాళ్ళ ప్రోద్బలంతో సంజన ఓ టెన్నిస్ క్లబ్‌లో చేరింది. అక్కడ టెన్నిస్‌తో బాటు షటిల్ బాడ్‌మెంటన్ కూడా ఆడవచ్చు. ఇన్‌డోర్ గేమ్సులో టేబుల్ టెన్నిస్, పేకాట వున్నాయి. ఆ క్లబ్బులోనే మంచి కాంటీనుంది. స్వీట్స్, సేవరీస్‌తోబాటు కూల్‌డ్రింక్, టీ, కాఫీ కూడా ఆ కాంటీనులో దొరకుతాయి.

అది చాలా హైక్లాస్ క్లబ్. అక్కడ మెంబర్ షిప్ దొరకడమే కష్టం. పైగా పెద్ద ఎత్తున రుసుం చెల్లించుకోవలసి వుంటుంది. అందుచే ఆ క్లబ్బులో ఆడేవారు ధనికులూ, పేరున్న వ్యక్తులూ. ముఖ్యంగా ఆ క్లబ్బులో పురుషుల సంఖ్యకన్నా స్త్రీల సంఖ్య ఎక్కువ. సంజనకు అందం, ధనంతో బాటు హుందాతనమూ వుంది. తన స్టేటస్‌కు తగ్గ గర్వముంది. సంజనకు ఆ క్లబ్బులో చేరిన కొద్దిమాసాలకే చాలామంది స్నేహితురాళ్ళు ఏర్పడ్డారు. బాగానే కాలక్షేపమవుతుండేది.

ఆ క్లబ్బులో చేరి టెన్నిస్ ఆట నేర్చుకోడానికి ఉబలాట పడేవారికి ఓ మగ కోచ్ రామస్వామిని ఆ క్లబ్ యజమాన్యం నియమించింది. రామస్వామి సౌమ్యుడు, ప్రవీణుడు. ఓ నెల్లాళ్ళలో టెన్నిస్ రేకట్ (బాటుని)



ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 2-2-96

సరిగ్గా పట్టుకోడం, బంతిని కొట్టడం వచ్చేటట్లు చేసేవాడు. అతనే కాక ఉల్లాసంగా తమకు తాముగా ఆ సుందరాంగులకు ఆటలో మెలకువ లను నేర్పేందుకు ముందుకు వచ్చే యువకులు కొందరున్నారు.

అక్కడున్న మెంబర్లంతా హైక్లాస్ వాళ్ళే గనుక ఎవ్వరూ తప్పపట్టరు. ఎంత చొరవగా వుంటే అంత నాగరికత లేకుంటే కంట్రీ స్టఫ్ అంటారు. ఆ క్లబ్బులో సంజనకు మోహన సన్నిహితురాలైంది. మోహన రూపం మెహన్ మైనదే. ఆమెకు ఆడ, మగ స్నేహితులు ఎందరో వున్నారు. మోహనకు మగస్తోత్ర పాఠకులకు కొదువలేదు. సంజనా చక్క నిదే. అందుకే సంజనకు మోహన యందు కాస్త జెలసీ లేకపోలేదు.

ఒకనాడు కావేరి, సంజన దూరంగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. కావేరి అంది– 'చూడు సంజనా! బెల్లం చుట్టూ చీమలు చేరినట్లు ఆ మోహన చుట్టూ ఆ యువకుల్ని చూడు.ఆమెలో ఏ ఆకర్షణ వుందోగాని! మరి మన దగ్గరకు అంతమంది చేరరే– ఏమమూ అందంగానే వున్నా."

"కావేరీ! ఆమెలోని ఆ ఉల్లాసం, మాటల నేర్పరితనం అట్లాంటివి. వాళ్ళంతా ఆమెను ప్రేమిస్తున్నారంటావా?"

"ప్రేమో, మోహమో ఎవరు చెప్పగలరు? ఆమె అంటే ముఖ్యంగా ఆ విజయకుమార్ పడి చస్తాడు" అంది కావేరి.

"ఎవరూ? టెన్నిస్ బాగా ఆడతాడు, కొంతమందికి ఆటను నేర్పుతుం టాడు అన్ అఫీషియల్ కోచ్‌లా– అతడేనా?" అడిగింది సంజన.

"అవును అతడే. ఇక్కడున్న గుంపులో అతడే అందగాడు, మంచి స్పోర్ట్స్‌మన్."

"అహ! నేనూ చూసేను మోహనకు చేరువగా తిరుగుతుండడం."

సంజన మనస్సులో ఓ అల మెదలింది. ఆ విజయకుమార్‌ని తనవైపుకు త్రిప్పుకోవాలి. తన ఉనికిని గుర్తించేటట్లు చేయాలి. విజయకుమార్‌ని మోహనకు దూరం చేయాలి. ఆ మోహన గర్వం అణచాలి. మోహన మాటల్లోనూ, చేష్టల్లోనూ ఆ గర్వం తొణికిసలాడేది. అదే సంజనకు చికాకు కల్గించే విషయం.

ఒకనాడు విజయకుమార్ విడిగా నించుని ఓ డబుల్స్ ఆటను గమ నించడం చూసి సంజన అతడి దగ్గరకు వెళ్ళి నించుంది. అతడు ఆమెను చూడగానే–

"నమస్తే! సంజనగారూ– మీరాడడం లేదేమి?" అని చిరునవ్వుతో పలకరించేడు.

"ఇంతకు క్రితమే ఒక గేమ్ ఆడేను. కాని నాకంత సంతృప్తి కలగలేదు. నా ఫోర్‌హేండ్ డ్రైవ్ అంత బాగా రావడం లేదు. కొంచెం లోగా వేస్తే నెట్టుకు తగులుతోంది. హేండ్ రెయిజ్ చేసి వేస్తే అవుట్‌కి పోతోంది– ఏం చెయ్యను చెప్పండి?"

విజయకుమార్ సంజనను కాస్త ఎగాదిగా చూసేడు. సంజన అంద మైందే అనుకున్నాడు. ఆమె ఇలా ఒంటరిగా వచ్చి అడగడంతో ఏదో అపేక్షను గ్రహించేడు.


"సంజనగారూ! నిరుత్సాహ పడకండి. నాకో పదిహేను రోజులు అవకాశమిచ్చి చూడండి– మీ ఫోర్ హేండ్ డ్రైవే కాదు, బాక్ హేండ్‌ని ఇంప్రూవ్ చేయిస్తాను.

"మీకా నమ్మకముంటే అలాగే కానీయండి" అంది సంజన చిరున వ్వుతో.

"మనలో మాట– మోహనగారి ఆట ఎంత పాడుగా వుండేది. నా తర్ఫీదు వల్ల ఓ నెల్లాళ్ళలో ఆమె గేమ్ ఎంతగా ఇంప్రూవ్ అయిందో చూసేరుగా. మోహనగారు మీకు చెప్పేవుంటారు."

"అవునవును–మీ ఎబిలిటీ మీ ఆట చూస్తేనే తెలుస్తోంది."

సంజన విజయకుమార్‌ని దగ్గర నుండి గమనించింది. అతడి రూపం, అతడి మాటలు ఆమెకు బాగా నచ్చేయి.




"సరే– రేపటి నుండి కాస్త వీలుచేసుకుని నాకు నేర్పండి శ్రమనుకోక."

"ఎంత మాటండి! శ్రమ ఏమీ లేదండి, అది నా కానందమే."

ఆనాటి నుండి సంజన, విజయకుమార్ స్నేహితులయ్యారు. మోహన ఆ విషయాన్ని గ్రహించి నవ్వుకుంది, గాని అసూయపడ్తున్నట్లు ఏ సూచనా లేదు. పైగా– "సంజనా! విజయకుమార్ మంచి నేర్పరి. నీ ఆటను బాగా మెరుగు పరుస్తాడు. ఆ మెలకువలన్నీ అతడికి బాగా తెలుసు. ఈ సంవత్సరం అతడు మన స్టేట్‌కే ఛాంపియన్ అవుతాడని అందరూ అనుకుంటున్నారు," అని విజయకుమార్ ఘనతను శ్లాఘిం చింది.

సంజనకు కాస్త ఆశ్చర్యం కల్గింది మోహన మాటలకు. విజయకుమార్ ని తనవైపుకు తిప్పకున్నా మోహన ఎందుకు అసూయపడడం లేదు? ఓడినా గెలిచేనన్నట్లు ప్రవర్తిస్తున్నదేమి?

విజయకుమార్ ఆట నేర్పే నెపంతో, ఆమె చేతుల్ని వెనుకనుండి ఆమె భుజాన్ని తాకేవాడు. ఆమెకు మెల్లగా శరీరం పులకించ నారంభించింది. ఆ విధంగా రెండు నెలలు గడిచేసరికి సంజన విజయకుమార్ బాగా సన్నిహితులయ్యేరు. క్రమేపీ ఆకర్షితులయ్యేరు. మరో నెల్లాళ్ళకు సంజ నకు తాను విజయకుమార్‌ని ప్రేమిస్తున్నట్లు అనుమానం కలగజొచ్చింది.

సంజన ప్రేమ గురించి విన్నదీ చదివిందీ గానీ, ఆమె జీవితంలో ఆ ప్రేమ తటస్థ పడలేదు. సంజనకు ఆమె భర్తంటే ఇష్టమేగాని ఎన్నడూ ఆమె అతని గురించి తపించలేదు. కాపురం యాంత్రికంగానే జరిగిపోతూంది పెద్దగా థ్రిల్ ఏమీ లేదు. ఇన్నాళ్ళకు ఆమె హృదయం ఏదో ఆశిస్తూ మిక్కుటంగా కొట్టుకుంటూంది.

కొన్నాళ్ళకు విజయకుమార్ ప్రేమలో సంజన తలమునకలైంది. మాటల సరసంతో మరి తృప్తి చెందలేకపోయింది. అతడి బాహువుల్లో వాలడానికి ఆతృత చెందింది. ఆమె ఊహాపథంలో ఆమె భర్త మెది లేదు. ఇదంతా మీ తప్పే అని చెప్పకుంది. ఆ నింద అతడిపైవేసి తనని తాను సముదాయించుకుంది.

ఒకనాడు ఎవ్వరూ వినకుండా– "సంజనగారూ! ఎప్పుడూ, ఎక్కడ మన కలియిక?" అని విజయకుమార్ సరసంగా అడిగేడు.

సంజన ఇటూ అటూ చూసింది. దగ్గరలో ఎవ్వరూ లేరు. కాస్త ఆలోచించి–

"ఎల్లుండి శనివారం ద్రాక్షతోటలో వున్న మన కాటేజీకి పోదాం. మీరు బస్టాండ్‌లో సాయంత్రం అయిదు గంటలకు వుంటే, నేను నా కారులో వచ్చి మిమ్మల్ని పికప్ చేస్తాను. మా వారు శుక్రవారం బొంబాయికి ఆఫీస్ వ్యవహారంపై వెళ్తారు. మళ్ళీ సోమవారంకు గాని రారు. మనకి రెండు రోజులు స్వేచ్ఛ–సరేనా?"

"ఓకె– అలాగే ఎల్లుండి కలుద్దాం," అని అక్కడినుండి కదిలేడు.

ఆ మరునాడు తన భర్త బొంబాయికి బయలుదేరి పోగానే సంజన తోటకు ఫోను చేసింది– "మల్లయ్యా! నువ్వు మీ గ్రామం పోతానని, రెండు రోజులు శెలవు అడిగేవుగా? ఎప్పుడు శలవు కావాలి?"

"మీరు దయతలుస్తే రేపు మధ్యాహ్నం బస్సులో మా ఊరికిపోయి సోమవారం పొద్దున్న పది గంటలకు తిరిగి వచ్చేస్తాను అమ్మగారూ!"

"అలాగే రేపు వెళ్ళు."

అనుకున్న ప్రకారం శనివారంనాడు సాయంత్రం తన గర్ల్ ఫ్రెండ్స్‌తో పిక్‌నిక్‌కి పోతున్నట్లు తనింట్లోని పనివాళ్ళకు చెప్పి భోజన కారియర్ నిండా తినే సామాన్లను, స్వీట్స్‌ని, సేవరీస్‌ని పెట్టుకుని కారులో బయలుదేరింది కాటేజి తాళం చెవితో. తోవలో బస్టాండ్‌లో విజయకుమార్‌ని కలసి తన వెంట తీసుకుని పోయింది.

కాటేజి లోపలికి పోగానే, రూమ్ ఎయిర్ కండిషనర్ని వేసింది. తను ఓసారి గదులన్నీ తిరిగి మల్లయ్య కాటేజిని నీటుగానే వుంచేడని తెలుసుకుని సంతోషించింది. విజయకుమార్ కూడా చూసి "కాటేజి చాలా బాగుంది. హోటల్ రూముకన్నా ఇదే మంచిది." సంజన హైక్లాస్ యువతని విజయకుమార్ తెలుసుకున్నాడు.

సంజనకు అదో విచిత్ర అనుభూతిగా తోచింది. ఆ రాత్రి జరగనున్న కార్యక్రమాన్ని ఊహించుకోగానే ఆమె శరీరం మెల్లగా వేడెక్క నారంభించింది. మనసుపడ్డ వానితో సంగమం ఎంత మధురంగా వుంటుందో ఊహించుకో నారంభించింది. విజయకుమార్ కూడా తనని గాఢంగా ప్రేమిస్తున్నాడనుకుంది. అతడి ప్రేమపూరితమైన చూపులే చెప్తున్నాయి.

ఆమె బిత్తరచూపుల్ని, వణుకుతున్న చేతుల్ని విజయకుమార్ గమనించేడు. ఆమెకిదే తొలి అనుభవం అని గ్రహించేడు. తను చొరవ తీసుకుంటేగాని వ్యవహారం సాఫీగా పోదనుకున్నాడు. ఆమెకు చేరువగా వచ్చి, ఆమె భుజాలను పట్టుకుని ఆమె ముఖంలోకి ఎంతో ప్రేమగా చూస్తూ అన్నాడు–

"నన్ను ఈ రాత్రికే వుండమంటారా, లేక రేపు పగలు, రాత్రి కూడా వుండాలా?"

"ఏం అలా అడుగుతున్నారు? మీకు వేరే తొందర పనులేవీ లేవుగా!" కాస్త ఆశ్చర్యపోతూ అడిగింది సంజన.

"నాకు వేరే పనులేమిటి? నా వృత్తి ఇదేగా. నా ఉద్యోగం ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్టు అని చెప్పేను కదా– అంటే మీకు ఆనందాన్నివ్వడం, మీరిచ్చింది పుచ్చుకోవడం."

"అంటే?" మరింత ఆశ్చర్యపోతూ అడిగింది సంజన.

"మరేంలేదు– మీకు మోహనగారు చెప్పంటారని అనుకుంటున్నాను. నా రేటు ఒక రాత్రికి మూడు వేలు, ఒక పగలుకి మూడు వేలు. అంటే ఇరవై నాలుగు గంటలు మీతో కలిసి వుంటే ఆరు వేలవుతుంది. మరో రాత్రికి వుంటే మరో మూడు వేలు. మొత్తం తొమ్మిది వేలు. నన్ను కోరినవారందరి దగ్గర అదే రేటు పుచ్చుకుంటున్నాను," అని చిరునవ్వుతో ఆ ప్రేమికుడు విజయకుమార్ జవాబిచ్చేడు.

ఆ జవాబుతో సంజనకు తలమీంచి ఓ బిందెడు ఐస్ వాటర్ పోసినట్లయింది. ఊహించుకున్న ప్రేమంతా మాయమైంది. మోహంతో వేడెక్కిన శరీరం ఒక్కసారి చల్లబడిపోయింది. మెల్లగా ఆమెలో కోపం రగుల్కొంది.

"మిస్టర్ విజయకుమార్! ప్లీజ్ గెటవుట్," అని సంజన అరిచింది.


"నేనన్నదాంట్లో తప్పేముందండీ? మీరు కోరుకున్న ఆనందాన్నివ్వ కల్గిన శక్తి నాలో వుంది. మీరు కావాలని నన్నిక్కడకు తీసుకుని వచ్చేరు. మరిప్పుడు ఈ కోపం ఎందుకండీ?" ఆశ్చర్యపోతూ విజయకుమార్ ఆమెవైపు చూసేడు.

"మీరు కిరాయికి పోయే స్టడ్‌బుల్ అన్నమాట. నాకింతకు ముందీ సంగతి తెలియదు. అందుకే ఈ పొరబాటు జరిగింది. దయచేసి మీరిక్కడ నుంచి వెంటనే వెళ్ళిపొండి," అని సంజన తీక్షణంగా, ఏహ్యంగా చూస్తూ అంది.

విజయకుమార్ మరి ప్రయోజనం లేదని తన హ్యాండ్‌బ్యాగు తీసుకుని చర చరా నడుచుకుంటూ వెళ్ళిపోయేడు. సంజన దుఃఖంతో తలని రెండు చేతులతో పట్టుకుని సోఫాలో కూలబడింది.

తను తొందరపడి ప్రేమ అనే పద్మవ్యూహంలో చిక్కుకుని తనని తాను ఎలా మలిన పరచుకోబోయిందో తలచుకుంటేనే ఆమె శరీరం కుంచించుకుపోతోంది. ఆ మరునాడే సంజన పట్నంలోని క్లబ్బులన్నింటిలోనూ తన మెంబర్‌షిప్‌ని రద్దు చేసుకుంది. బోలెడన్ని ఇంగ్లీష్, తెలుగు పుస్తకాలనుకొని తెచ్చుకుంది ఇంట్లో కూచుని చదువుకోడానికి.

## మహా భారీ టెలిఫోన్



మనం రోజూ చూస్తూ వుండే టెలిఫోన్లు చిన్నవి కదూ! అయితే 8.8 మీటర్ల పొడవు, 6.6 మీటర్ల వెడల్పు, 3.84 మీటర్ల ఎత్తుతో 6 టన్నుల బరువు గల టెలిఫోన్‌ను మనం ఊహించలేము. అయితే ఇది ఊహ కాదు– నిజం! స్విట్జర్లాండ్‌లోని తున్‌లో ఈ మహాభారీ ఫోన్ ఏర్పాటుచెయ్యబడింది! గిన్నిస్ బుక్‌లోకి ఈ ఫోన్‌ను నమోదు చేయించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ఫోన్ మీద నలుగురు మనుషులు హాయిగా నిలబడవచ్చు. పిల్లలు దీనిని చూస్తే ఎంతో ముచ్చట పడతారు కదూ?

– సేకరణ: కొడిమెల

